క్లుప్తంగా

బంకించంద్ర చటర్జీకి ఘన నివాళులు


బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: జాతీయ గీతం వందేమాతరాన్ని రచించిన బంకిం చంద్ర చటర్జీ జయంతి వేడుకలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. చటర్జీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, అధ్యాపకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చటర్జీ రచించిన వందేమాతరం గేయం జాతీయ స్థాయిలో మంచిపేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిందని కొనియాడారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపకులు శ్రీనివాసరావు, వినోద్‌రాజు, కమలాకరరావు పాల్గొన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మాలతి

పొందూరు: మండలంలోని మజ్జిలిపేట గ్రామంలో చినజీయర్‌స్వామి ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన మహిళా ఆరోగ్య వికాస్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వికాస తరంగణి వైద్యులు మాలతి 85 మంది మహిళలకు వైద్య సేవలందించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. వికాస తరంగణి చీఫ్ కోఆర్డినేటర్ మెట్ట ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వికాస తరంగణి మహిళా ఆరోగ్య వికాస్ సమన్వయకర్త శ్యామల, సిబ్బంది జయలక్ష్మి, రామానుజదాసు, చక్రధర్, వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో గ్రామసభ


మాట్లాడుతున్న సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం


బూర్జ: మండలంలోని వైకుంఠపురం గ్రామంలో సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం, వివిధ రకాల పింఛన్లకు సోషల్ ఆడిట్‌కి సంబంధించి గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి పనులు, పింఛన్‌లకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుబంధంగా చేపట్టాలని, వేతనాన్ని పెంచాలని గ్రామస్తులు కోరారు. వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, ఏపీఓ వి.రాజ్‌కుమార్, సోషల్ ఆటిడ్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక లాభాలు


యాంత్రీకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటరావు

సారవకోట: వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక లాభాలు ఉన్నాయని ఏఓ కె.సి.హెచ్.వెంకటరావు సూచించారు. మండలంలోని బుడితి గ్రామంలో రెడ్డీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో ఎరువు, విత్తనం ఒకేసారి వేసుకునే విధానంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మారిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోనూ వ్యవసాయ కార్మికులు అందుబాటులో ఉండటం లేదని, రైతులు యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె.ధర్మారావు, వీఏఏ దిలీప్, ఎంపీటీసీ మెండ మురళి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆయా తరగతుల ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలన్నారు. ప్రభుత్వం అందించే పుస్తకాలతోనే విద్యాబోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థుల రవాణా, మంచినీటి సదుపాం, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతుల కల్పనలో జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థుల హాజరు ఉదయం 10 గంటల లోపే పూర్తిచేయాలన్నారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

- పలుచోట్ల పొలాల్లో చేరిన వర్షం నీరు
- జలమయమైన రహదారులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లో గురువారం కురిసిన వర్షం రైతులకు, ప్రజలకు ఊరటనిచ్చింది. ఉదయం 11 గంటల కల్లా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు చేరింది. ఈ వర్షం రైతులకు ఉపకరిస్తుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. నరసన్నపేట టౌన్‌లో వీధులన్నీ జలమయమయ్యాయి. పాత బస్టాండ్ వద్ద ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో నీరు చేరింది.

జలుమూరు: మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 15 రోజులుగా వరి వెదలు వేసి వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూసిన రైతులకు ఈ వార్షం కాసులు కురుపిస్తుందన్నారు. దాదాపు 95 శాతం వరకు వరి వెదలు పూర్తయ్యాయి. మండలం పరిధిలో సుమారు 20 వేల ఎకరాల్లో పల్లపు ప్రాంతాల్లో మూడు నుంచి ఐదు వందలు ఎకరాలు మినహా వరి వెదలు చల్లడం పూర్తి చేశారు.

కొత్తూరు: మండలంలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. వరుణిడి కరుణ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి, గురువారం భారీ వర్షాలు కురవడంతో వంగతోపాటు పలు రకాల విత్తనాలు పొలాల్లో నాటారు. కొంతమంది రైతులు వరి విత్తనాలు వేశారు.

సరుబుజ్జిలి: మండలంలో పలు ప్రాంతాల్లో గురువారం వర్షం దంచికొట్టింది. అలికాం–బత్తిలి ప్రధాన రహదారిలో వర్షంనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడ్డారు. మురుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల మురుగునీరు రహదారులపై చేరింది.

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షం కూరవడంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అచ్యుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, ఆర్.ఎల్.పురం, సరాలి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పాతపట్నంలో భారీ వర్షం పడడం వల్ల సుమారు గంట పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

ఆమదాలవలస: పట్టణం, మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రహదారులపై వరదనీరు చేరింది. ప్రయాణికులకు ఇక్కట్లు పడ్డారు. రైల్వే అండర్ టన్నల్ వేలో వరద నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వర్షం నీరు చేరింది.


నరసన్నపేట: కోమర్తి పరిసరాల్లో కురుస్తున్న వర్షం


నరసన్నపేట: పాతబస్టాండ్ వద్ద కొవెల వైపు రోడ్డులో నిలిచిన వర్షంనీరు


జలుమూరు: వర్షం కురుస్తున్న దృశ్యం


సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై చేరిన వర్షంనీరు


పాతపట్నంలో కురుస్తున్న వర్షం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బూర్జ: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాజశేఖర్, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రోజా ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ జులై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లల పేర్లను నమోదు చేయాలన్నారు. ప్రతి పిల్లవాడికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందజేసి డైయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఎంఈఓ బి.ధనుంజయరావు, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీ-సేవ కేంద్రాల్లో సేవలు కొనసాగించాలి

ఆమదాలవలస: మీ–సేవ కేంద్రాల్లో సేవలు కొనసాగేలా ప్రభుత్వం యత్నిస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమదాలవలస నియోజకవర్గ మీ–సేవ కేంద్ర నిర్వాహకులు ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసే మీ–సేవ కేంద్రాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకుని పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. మీ–సేవ కేంద్రాలు యథాతథంగా కొనసాగిస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మీ–సేవ కేంద్రాల నిర్వాహకులు అన్నెపు రమణమూర్తి, మొదలవలస సురేష్, బూర్జ మండల మీ–సేవ కేంద్రం ఆపరేటర్ పప్పల హరినాథరావు, సనపల హరి ప్రతాప్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, అన్నెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మీ-సేవ నిర్వాహకులు

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు అందిస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. వంశధార కుడి కాలువ (పెద్దదూగాం నుంచి నరసన్నపేట)ను గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువ ఆధునీకీకరణ, పూడిక తీయడం, షట్టర్ల మరమ్మతులు వంటివి రైతులు సహకారంతో చేయడం జరుగుతుందన్నారు. వంశధార డీఈఈలు శ్రీహరి, సురేష్, నాయకులు బగ్గు గోవిందరావు, వెలమల రాజేంద్ర నాయుడు, దుంగ స్వామిబాబు, పిరియా వెంకటరావు పాల్గొన్నారు.


వంశధార అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు


భజనల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలోని షిర్డీ గిరిపైన కొలువైన షిర్డీ సాయినాథుడుని గురువారం భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని బాబాకు పూజలు నిర్వహించి, అర్చకుల ఆశీర్వాదాలను పొందారు. పాతపట్నం, ఒడిశా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మందిరం సభ్యులు పాల్గొన్నారు.

భూ అక్రమాలపై దర్యాప్తు చేయాలి

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ గ్రూప్‌లోని 202-5బి, 201-2 సర్వే నంబర్లలో ఉన్న దేవాదాయశాఖకు చెందిన భూముల్లో రెవెన్యూ అధికారులు పాల్పడిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.ప్రసాదరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కొత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములను రీ సర్వేలో ఓ వ్యక్తి పేరున నమోదు చేసి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు నిబంధనలు పాటించలేదన్నారు. ప్రభుత్వ భూములను జిరాయితీగా మార్చినట్లు ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ తులగాం ఫీడర్‌కు సంబంధించి శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

సరుబుజ్జిలి: గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం వల్ల ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా ఈఓపీఆర్డీ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని డీఎల్‌పీ గోపిబాల స్పష్టంచేశారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కొత్తకోట, బప్పడాం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును గురువారం పరిశీలించారు. మురుగునీరు, చెత్తకుప్పలు నిల్వ లేకుండా తొలగించే ఏర్పాట్లు తక్షణమే చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ ఆనందబాబు, కొత్తకోట పంచాయతీ సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ అధికారులకు మండల స్పెషల్ ఆఫీసర్ గణపతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐకేపీ, పంచాయతీ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి బోర్లు, వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. పొందూరు, కొంచాడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ శ్రీనివాసరావు, ఏపీఎం శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: పారిశుద్ధ్య మెరుగుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వెలుగు టెక్కలి ఏరియా కో ఆర్డినేటర్ శ్రీరాములు సూచించారు. ఏపీఎం గోవిందరాజులతో కలిసి మండల కేంద్రంలో గురువారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు నీరు ఎక్కడిక్కడే నిల్వ ఉంటుందన్నారు. చెత్త, పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు కాలువల్లో వేయవద్దన్నారు.


సరుబుజ్జిలి: కొత్తకోటలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ


పొందూరు: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ గణపతి, సర్పంచ్ రేగిడి లక్ష్మి


సారవకోట: మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఏసీ శ్రీరాములు

బడి బయట పిల్లలను గుర్తించాలి


సారవకోట: ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ ఈఓ, ఎంఈఓలు, ఉపాధ్యాయులు


మెళియాపుట్టి: నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఎల్.ఎన్.పేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సారవకోట: బడి బయట పిల్లలను గుర్తించాలని టెక్కలి డిప్యూటీ ఈఓ విలియమ్స్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్, సీఆర్పీ, ఐఈఆర్టీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లల్ని గుర్తించేందుకు నేను బడికి పోతా, విద్యా ప్రవేశం అనే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీంట్లో భాగంగా బడి బయట గల 14 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని సూచించారు. సారవకోటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. సమగ్ర శిక్ష ఏపీఓ నలినీకాంత్, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ జనార్దన్, ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

'నేను బడికిపోతా'

మెళియాపుట్టి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు అన్నారు. మండలంలోని వసుంధర గ్రామంలో 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తామన్నారు. చదువుకునే వయస్సు పిల్లలు బడిబయట ఉండకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బాబూరావు, లలిత, భాస్కరరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ప్రతి విద్యార్థినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి చదివించాలని పూశాం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.జయరాం అన్నారు. మండలంలోని పూశాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడి వయసు కలిగిన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడిలో చదివించటం వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ కె.త్రివిక్రమరావు అన్నారు. నేను బడికిపోతా కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులను కోరారు. ఎంఈఓలు శ్రీనివాసరావు, గోవిందరావు, పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం


నరసన్నపేట: కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


సారవకోట: స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక పెద్దపేట రోడ్డులో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్త శిమ్మ కృష్ణమూర్తి నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కృష్ణబాబు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం..

సారవకోట: మండలంలోని చీడిపూడి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని కల్యాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని, ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని కల్లట, సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఆదర్శ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేసి ఆధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

స్టూడెంట్ కిట్లు పంపిణీ


బూర్జ: కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకులు స్టూడెంట్ కిట్లు గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందన్నారు. పార్టీ నాయకులు జల్లు ఆదినారాయణ, మజ్జి నర్సింగరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కొత్తూరు: కిట్లు పరిశీలిస్తున్న ఎంఈఓలు శ్రీనివాసరావు, గోవిందరావు

ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్ అందించాలి

కొత్తూరు: ప్రతి విద్యార్థికీ స్టూడెంట్ కిట్ అందిస్తామని ఎంఈఓలు ఎస్.శ్రీనివాసరావు, గోవిందరావు అన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లును పరిశీలించారు. ప్రభుత్వం అందించిన అన్ని రకాల సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు కిట్లో ఉన్న సామగ్రీ మొత్తం విద్యార్థుల వద్ద ఉండాలన్నారు. హెచ్ఎం ఎ.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

పాతపట్నం: పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కొరసవాడ పశువైద్యశాఖ ఏడీ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని పెద్దలొగిడి గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ ఆరు నెలలకు పైబడిన ప్రతీ పశువుకు ఈ టీకాలు వేయించాలన్నారు. సూడి ఉన్న పశువులకు కూడా ఈ టీకాలు వేయించవచ్చన్నారు. గొంతువాపు, జబ్బవాపు వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. మండలంలో 2,500 టీకాలు వేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పశువైద్యులు కె.మౌనిక, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యులు, సిబ్బంది

కేంద్రమంత్రిని కలిసిన సిరిపురం

హిరమండలం: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను పాతపట్నం బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిజేశారు.


కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను కలిసిన తేజేశ్వరరావు